సాక్షి నంద్యాల

మంగళవారం ; 10 ; సెప్టెంబర్ ; 2024



అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్

గురురాఘవేంద్ర లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లో పంప్ సెట్ల ధ్వంసం కేసును పోలీసులు ఛేదించారు. ముగ్గురు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్ట్ చేసి, చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. 8లో▸



ఈరన్నస్వామికి ప్రత్యేక పూజలు

కర్నూలు జిల్లా ఉరుకుంద గ్రామంలో వెలసిన ప్రసిద్ధ ఈరన్నస్వామి దర్శనానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తిమట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,632
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:101.773
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 34,972
అవుట్ ఫ్లో(క్యూసెక్కులు)	:34,732

కిలో మిర్చి రూ. 1

- అన్నదాతను దారుణంగా దెబ్బ తీసిన పచ్చి మిర్చి
- భారీగా పతనమైన ధరలు
- పంట కోత దశలో కేజీ రూ.50.. ప్రస్తుతం కిలో రూ.1
- పెట్టుబడి కూడా రావడం లేదని అన్నదాతల ఆక్రందన
- ధరల పతనానికి తోడు బింగి తెగులుతో పంట నాశనం
- పంటను దున్నేస్తున్న రైతులు

సాక్షి, నంద్యాల: కొనబోతే కొరివి.. అమ్మబోతే అడవిలా తయారైంది రైతన్నల పరిస్థితి. నిన్నమొన్నటి వరకు ఆశాజనకంగా ఉన్న పచ్చి మిర్చి ధర.. నేడు అమాంతం పడిపోయింది. ఇదే అదనుగా భావించిన దళారులు మరింత కక్కుర్తి పడి కిలో రూ.1 అడుగుతుండటంతో అన్నదాత ఆవేదన చెందుతున్నాడు. ధరల పతనానికి తోడు మిర్చి పంటను తెగుళ్ల దెబ్బతీయడంతో గోరుచుట్టుపై రోకలిపోటు అన్నచందంగా తయారైంది రైతన్నల పరిస్థితి. జిల్లాలో వరి, కంది తర్వాత అధిక శాతం మంది రైతులు మిర్చి పంటను సాగు చేస్తున్నారు. రుద్రవరం, చాగలమర్రి, శిరివెళ్ల, పాణ్యం, బనగానపల్లె మండలాల్లో అధికంగా సాగు చేస్తున్నారు. రుద్రవరం, చాగలమర్రి మండలాల్లో సాగు చేసిన మిర్చిని బింగి తెగులు దెబ్బతీయడంతో రైతులు పంటను దున్నేస్తున్నారు.

పంట తొలి కోత దశలో రూ.2 వేలు

జిల్లాలో సాగు చేసిన మిరప పంట చాలా ప్రాంతాల్లో జులై మూడో వారంలో తొలి కోత దశకు వచ్చింది. పంట చేతికి వచ్చే సమయంలో ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. కిలో గరిష్టంగా రూ.40 నుంచి రూ.45 వరకు ధర పలికింది. ఇవే ధరలు రెండు నెలల పాటు కొనసాగితే తమ అప్పులన్నీ తీరిపోతాయని రైతులు అనుకున్నారు. కానీ, కేవలం వారం పాటే ఈ ధర పలికింది. ఎనిమిదో రోజు నుంచి ధర పతనమవుతూ వచ్చింది.

ప్రస్తుతం కిలో రూ.1

పచ్చి మిర్చి ధరలు నెల రోజుల్లోనే భారీగా పతనమయ్యాయి. ప్రస్తుతం రైతుల నుంచి కిలో రూ.1 కి మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. కాయలు కోసేందుకు వచ్చే కూలీలకు ఇవ్వడానికి కూడా ఈ డబ్బు సరిపోవడం లేదని రైతులు వాపోతున్నారు. మరోవైపు మిరప పంటను బింగి తెగులు నిండా ముంచింది. మిరపలో సాధారణంగా ముడత, బూజు తెగులు, బింగి తెగుళ్లు వస్తుంటాయి. రుద్రవరం, చాగలమర్రి, శిరివెళ్ల మండలాల్లో సాగుచేసిన మిరపలో అధిక శాతం పంట బింగి తెగుళ్ల బారిన పడింది.



రెడ్డిపల్లె సమీపంలో బింగి తెగులు బారిన పడిన మిర్చి పంట



తెగులు సోకడంతో ముడుచుకుపోయిన మొక్క

భారీగా తగ్గిన సాగు విస్తీర్ణం

మిరపలో నలుపు కాయలకు సంబంధించి కృష్ణ, తెలుపు కాయలకు సంబంధించి డింపుల్ రకాలను జిల్లా రైతులు ఎక్కువగా సాగుచేస్తున్నారు. ధరలు పతనం కావడం మిరపకు తెగుళ్ల ఉధృతి అధికం కావడంతో రైతులు సాగు వైపు ఆసక్తి చూపడం లేదు. దీంతో సాగు విస్తీర్ణం భారీగా తగ్గింది. జిల్లాలో 12,262 హెక్టార్లలో సాధారణంగా మిర్చి సాగు చేస్తుంటారు. అయితే ఈ ఏడాది ఇప్పటివరకు 6,491 హెక్టార్లలో మాత్రమే సాగు చేశారు.

ఎకరాకు రూ.లక్ష వరకు పెట్టుబడి

జిల్లాలోని రైతులు మిరప మొక్కల కోసం గుంటూరుకు వెళ్తుంటారు. ఒక్కో మొక్కను రూ. 1 వరకు కొనుగోలు చేస్తున్నారు. మరికొంతమంది రైతులు విత్తనాలు నర్సరీ యజమానులకు ఇచ్చి తర్వాత వారి నుంచి 30 పైసల నుంచి 40 పైసలకు కొనుగోలు చేస్తున్నారు. కానీ, ఎక్కువ శాతం మంది రైతులు డైరెక్ట్‌గా మిరప మొక్కలనే కొంటున్నారు. ఎకరాకు సుమారుగా 40 వేల మొక్కలు నాటుతున్నారు. మందులు, కూలీలు, కలుపు నివారణ కోసం ఎకరాకు రూ.60 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. కానీ, తెగుళ్ల సోకడం ధరలు పడిపోవడంతో ఎకరాకు రూ.40 వేలు కూడా రావడం లేదు. దీంతో ఒక్కో ఎకరాకు రూ.60 వేల వరకు నష్టపోతున్నారు. మరోవైపు కౌలు

పంటను దున్నేస్తున్నా



ఇక్కడ కనిపిస్తున్న రైతు పేరు తెలుగు నడిపెన్న. రుద్రవరం మండలకేంద్రం. ఇతడు ఎకరాకు రూ.37 వేల చొప్పున మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని జూన్ మొదటి వారంలో మిర్చి పంట సాగు చేశాడు. ఒక్కో ఎకరాకు రూ.లక్ష వరకు పెట్టుబడులు పెట్టాడు. బింగి తెగులు సోకడంతో వారానికి రెండు సార్లు చొప్పున మందులు పిచికారీ చేశాడు. అయినా తెగులు తగ్గలేదు. ఇప్పుడు ధరలు కూడా లేవు. కౌలు, పెట్టుబడి కలుపుకుని ఎకరాకు రూ.1.40 లక్షల వరకు ఖర్చు చేశానని, ఇప్పుడేమో కిలో రూ.1 చొప్పున అడుగుతుండటంతో చేతికి రూ.40 వేలు కూడా రాలేదని, ఈ లెక్కన ఎకరాకు రూ.లక్ష వరకు నష్టం రావడంతో పంటను దున్నేస్తున్నానని రైతు నడిపెన్న ఆవేదనతో నిట్టూర్చాడు.



ధరలు గిట్టుబాటు కాకపోవడంతో పంటను దున్నేసిన దృశ్యం

ట్రాక్టర్లతో దున్నేస్తున్న రైతులు

ఒక్క రుద్రవరం మండలంలోనే సుమారు వెయ్యి ఎకరాల్లో మిరప సాగు చేశారు. తెగుళ్ల దాడితో రైతులు ప్రస్తుతం ట్రాక్టర్లతో దున్నేస్తున్నారు. ఆలమూరు, బీరవోలు, చంద్రలూరు, చిలకలూరు, చిన్న కంబలూరు, ఎల్లవతుల, ఎర్రగుడిదిన్నె, మండలూరు, పెద్ద కంబలూరు, రుద్రవరం, టి.లింగందిన్నె గ్రామాల్లోని రైతులు పంటను దున్నేస్తున్నారు.

సలహాలివ్వడం లేదు



పంటలకు తెగుళ్ల సోకితే ఏ మందు పిచికారీ చేసుకోవాలో కూడా అధికారులు చెప్పడం లేదు. ప్రైవేటు మందుల కంపెనీల వారు విపరీతంగా వస్తున్నారు. మా కంపెనీ మందు పిచికారీ చేస్తే తెగుళ్ల నశిస్తాయని చెబుతున్నారు. కానీ, వారిని ఎలా నమ్మాలి? ప్రస్తుతం మిర్చికి బింగి తెగులు ఉధృతంగా సోకుతోంది. తెగుళ్ల కంట్రోల్ కాకపోవడంతో కొంత మంది రైతులు పంటను ట్రాక్టర్లతో దున్నేస్తున్నారు.

– నర్ర వెంకటేశ్వర్లు, రైతు, రెడ్డిపల్లె

రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. మార్కెట్లో పచ్చి మిర్చి ధరలు నిలకడగానే కొనసాగుతున్నాయి. కూరగాయల మార్కెట్లో కేజీ రూ.30 నుంచి రూ.35 వరకు విక్రయిస్తున్నారు. కానీ, రైతులకు మాత్రం రూపాయితోనే సరిపెడుతున్నారు.

న్యూస్‌రీల్

యాగంటిపల్లె కేవీకేకు ‘అద్భుత’ అవార్డు



శాస్త్రవేత్త ధనలక్ష్మికి అవార్డు అందజేస్తున్న అవుట్‌లుక్ సంస్థ అధికారులు

బనగానపల్లె: మండలంలోని యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)కు అద్భుత పనితీరు పురస్కారం లభించినట్లు సీనియర్ శాస్త్రవేత్త ధనలక్ష్మి తెలిపారు. సోమవారం స్వరాజ్ ట్రాక్టర్ల సమర్పణతో నిర్వహించిన అవుట్‌లుక్ అగ్రిటెక్ సమిట్ అవార్డు –2024, 5వ ఎడిషన్‌ను న్యూఢిల్లీలోని ఎన్‌ఏఎస్‌ఈ కాంప్లెక్స్ ఏపీ సిండే ఆడిటోరియంలో నిర్వహించారు. నూతన వ్యవసాయం విధానాలను చేరవేసి, వ్యవసాయం లాభసాటిగా మార్చి రైతుల ఆదాయం పెంచడంలో చేసిన కృషికి గానూ కేవీకేకు అవార్డు లభించింది. కార్యక్రమంలో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ కార్యదర్శి దేవేష్‌చతుర్వేది, అవుట్‌లుక్ గ్రూపు సీఈఓ ఇంద్రనిల్‌రాయ్ పాల్గొన్నారు.

నేడు దిశా కమిటీ సమావేశం

నంద్యాల(అర్బన్): దిశా కమిటీ (కేంద్ర ప్రభుత్వ పథకాలు, నిధులు, అభివృద్ధిపై సమీక్ష) సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్, కన్వీనర్ రాజకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో ఉదయం 10 గంటలకు ఎంపీ బైరెడ్డి శబరి అధ్యక్షతన నిర్వహించే దిశా కమిటీ సమావేశంలో జిల్లా మంత్రులు, జిల్లా పరిషత్ చైర్మన్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు.

నిర్ణయించిన రవాణా ధరలకే ఇసుక సరఫరా

నంద్యాల(అర్బన్): ఈనెల 11 నుంచి ప్రభుత్వ నిర్ణయించిన రవాణా ధరలకే ఇసుక సరఫరా చేయాల్సి ఉంటుందని జిల్లా కలెక్టర్ రాజకుమారి ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ సభ్యులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ సభ్యులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇసుక రీచులు, స్టాక్ యార్డులు లేవని, సమీప జిల్లాల నుంచి ఇసుక సరఫరా చేసుకోవాలని సూచించారు. దీంతో ఇతర జిల్లాల నుంచి ఇసుక తెచ్చుకోవాలంటే టోల్ గేట్లు, డీజిల్ రేట్లు అధికమవుతాయని, రేటు విషయంలో వెసులుబాటు కల్పించాలని ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ సభ్యులు కలెక్టర్‌ను కోరగా.. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆమె హామీ ఇచ్చారు. సమావేశంలో ఆర్‌టీఓ శివారెడ్డి, భూగర్భ గనుల శాఖ ఏడీ రామచంద్ర పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష దరఖాస్తుకు 17తో గడువు పూర్తి

నంద్యాల(న్యూటౌన్): 2024–25 ఏడాదికి జరగనున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష దరఖాస్తుకు ఈనెల 17తో గడువు పూర్తి కానుంది. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని ఏపీ మోడల్ స్కూళ్లలో 8 వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు. కుటుంబ సంవత్సర ఆదాయం రూ.3,50,000 లోపు ఉన్న విద్యార్థులు వచ్చే ఈనెల 17వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 ఎస్‌బీఐ కలెక్ట్ లింక్ ద్వారా ఫీజు చెల్లించాలి. పూర్తి వివరాలు www.bse.ap.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు.

నంద్యాల వాసికి రెండు బంగారు పతకాలు



బంగారు పతకాలతో హాజీవలి

నంద్యాల(న్యూటౌన్): అంతర్జాతీయ క్రీడల్లో నంద్యాల వాసి షేక్ హాజీవలి ప్రతిభ చాటి రెండు బంగారు పతకాలు సాధించాడు. సోమవారం ఆయన మాట్లాడుతూ గత నెల 31 నుంచి ఈ నెల 4వ తేదీ వరకు నేపాల్‌లోని పోకరలో సంయుక్త భారతీయ ఖేల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ 65 కేజీల విభాగంలో 380 కేజీలు ఎత్తి బంగారు పతకం సాధించానన్నారు. బాడీ బిల్డింగ్ విభాగంలో స్ట్రాంగ్‌మెన్ 2024 నేపాల్ టైటిల్‌గా నిలిచి మరో బంగారు పతకం సాధించానన్నారు. నేపాల్‌కు చెందిన సంయుక్త భారతీయ ఖేల్ ఫౌండేషన్ జనరల్ సెక్రటరీ శివ థివారి, డైరెక్టర్ పంకజ్ గౌల చేతుల మీదుగా పతకాలు అందుకున్నట్లు హాజీవలి తెలిపారు.

సమస్యలకు పరిష్కారం చూపండి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(అర్బన్): ప్రజా సమస్యలకు ఎప్పటికప్పుడే పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో చేసిన ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎంతో నమ్మకంతో జిల్లా కేంద్రానికి ప్రజలు వస్తుంటారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా వీలైనంత త్వరగా పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన వినతులపై మరింత ఏకాగ్రతతో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ పద్మజ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వంద రోజుల ప్రణాళిక లక్ష్యాలను అధిగమించండి

వంద రోజుల ప్రణాళిక లక్ష్యాలను అధిగమించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో వంద రోజుల పనుల ప్రగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రగతి లక్ష్యసాధనలో కొందరు అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా ఉపాధి హామీ పనులకు కేటాయించిన లేబర్ బడ్జెట్ ఆత్మకూరు క్లస్టర్ పరిధిలోని అన్ని మండలాల్లో తక్కువగా ఉందని, పనితీరు మెరుగుపరచుకొని నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. డోన్, ప్యాపిలి, బేతంచెర్ల తదితర మండలాల్లో ఉపాధి హామీ కింద 1100 ఎకరాలలో చేపట్టిన పండ్ల తోటల పెంపకాన్ని వేగవంతం చేయాలన్నారు. రెవెన్యూ, ఇన్‌స్టిట్యూషనల్, బ్లాక్ ప్లాంటేషన్ కింద మొక్కల పెంపకానికి సంబంధించి పిట్టింగ్, కంచె ఏర్పాటు, ప్రతిదానికి ఉపాధి హామీ కింద డబ్బులిచ్చినా పనులు ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. ఇళ్ల నిర్మాణంలో ఉన్నప్పుడు 90 రోజుల పని దినాలకు సంబంధించి పొజిషన్ సర్టిఫికెట్ అడగాల్సిన అవసరం లేదని ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు ఆదేశాలు జారీ చేయాలన్నారు. పంట నష్ట వివరాల నివేదికలు మంగళవారం ఉదయంలోగా ఇవ్వాలన్నారు. గోస్పాడు, బనగానపల్లె, శిరివెళ్ల, బండిఆత్మకూరు తదితర మండలాలలో తక్కువ ప్రగతి ఉందని పంట నష్ట నమోదు, ఈక్రాప్ బుకింగ్ ఏకకాలంలో పూర్తి చేయాలన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజకుమారి

జిల్లాలో మోస్తరు వర్షం

నంద్యాల(అర్బన్): జిల్లాలో ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం మోస్తరు వర్షం కురిసింది. జూపాడు బంగ్లా మండలంలో అత్యధికంగా 9.2 మి.మీ వర్షం కురవగా బేతంచెర్లలో 1.2 మి.మీ వర్షం కురిసింది. వెలుగోడులో 8.8, చాగలమర్రి, కొత్తపల్లెలో 8.2, నందికొట్కూరులో 7.2, పగిడ్యాలలో 6.6, సంజామల 5.0, మహానంది 4.4, మిడుతూరు, ఆత్మకూరు 3.4, పాములపాడు 2.8 మి.మీ చొప్పున వర్షం కురిసింది.

నాక్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

డోన్ టౌన్: ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన –4 కింద ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నేషనల్ కన్‌స్ట్రక్షన్(నాక్) ద్వారా స్థానిక ప్రభుత్వ ఐటీఐ ఎదురుగా ఉన్న కార్యాలయంలో అసిస్టెంట్ సర్వేయర్, అసిస్టెంట్ ప్లంబరు జనరల్ కోర్సుల్లో స్వల్ప కాలిక వ్యవధిలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నాక్ కార్యాలయం ఇన్‌చార్జ్ తిమోతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి పూర్తి చేసిన 18 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు ఉన్న వారు అర్హులన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లతోపాటు వంద శాతం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి కల్గిన వారు ఈ కింద నంబర్లను 8297234474, 9642475749, 8328646601, 7661828641 సంప్రదించాలన్నారు. శిక్షణ సమయంలో ఉచిత వసతి భోజన సదుపాయాలు కల్పించనున్నట్లు ఆయన తెలిపారు.



విద్యా గణపతి!

నంద్యాల జిల్లాలో వినాయక చవితి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మండపాల్లో కొలువైన బొజ్జ గణపయ్యలు మూడోరోజు సోమవారం భక్తుల పూజలు అందుకున్నారు. నంద్యాల చిత్తులూరి వీధిలో ఆధ్యాత్మిక పుస్తకాలతో ఏర్పాటు చేసిన వినాయకుడు భక్తులను విశేషంగా ఆకర్షిస్తున్నాడు. – నంద్యాల(వ్యవసాయం)

విభూతి ధారణ పునఃప్రారంభం

శ్రీశైలంటెంపుల్: కోవిడ్ సమయంలో నిలుపుదల చేసిన విభూతి ధారణ సంప్రదాయాన్ని సోమవారం దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు పునఃప్రారంభించారు. ఆలయ సంస్కృతి సంప్రదాయాలపై భక్తులకు మరింత అవగాహన కల్పించాలనే సంకల్పంతో విభూతి ధారణ కార్యక్రమాన్ని పునఃప్రారంభించినట్లు ఈఓ తెలిపారు. నుదుట బొట్టు పెట్టుకోవడం సనాతన సంప్రదాయమన్నారు. విభూతి పవిత్రతను కలిగిస్తుందని, అరిష్టాలను తొలగించి సకల శుభాలను కలిగిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు హెచ్.వీరయ్యస్వామి, ఏఈఓలు ఎం.హరిదాసు, ఐ.ఎన్.వి.మోహన్, పీఆర్వో టి.శ్రీనివాసరావు, పర్యవేక్షకులు టి.హిమబిందు పాల్గొన్నారు.



భక్తులకు విభూతిధారణ చేస్తున్న ఈఓ పెద్దిరాజు

శ్రీశైల క్షేత్రంలో ‘మూడో కన్ను’

- సీసీ కెమెరాలతో శ్రీగిరి పర్యవేక్షణ
- అసాంఘిక శక్తులను గుర్తుపట్టేలా ఫేస్ రికగ్నైజేషన్ కెమెరాలు
- భక్తుల కౌంటింగ్‌కూ ప్రత్యేక కెమెరాల ఏర్పాటు

ఆది దంపతులు వెలసిన ముక్కంటి క్షేత్రం భద్రతకు పటిష్ట చర్యలు తీసుకున్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిరంతరం నిఘాను పర్యవేక్షిస్తున్నారు. ఆలయం, క్యూలైన్లు, పాతాళగంగ తదితర 578 ముఖ్యమైన ప్రదేశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి దేవస్థానంలోని కమాండ్ కంట్రోల్ రూం ద్వారా పర్యవేక్షిస్తున్నారు. అసాంఘిక శక్తులు క్షేత్రంలోకి ప్రవేశించినా అధునాతన టెక్నాలజీతో ఫేస్ రికగ్నైజేషన్ ద్వారా గుర్తుపడుతు పోలీసులకు సమాచారం అందిస్తున్నారు. శ్రీశైల క్షేత్రంలో ఏ చిన్న ఘటన జరిగినా క్షణాల్లో గుర్తించి అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. – శ్రీశైలంటెంపుల్


ద్వాదశ జ్యోతిర్లింగం, అష్టాదశ శక్తిపీఠం కలగలసి వెలసిన మహాపుణ్యక్షేత్రం శ్రీశైలం. అత్యంత మహిమాన్వితమైన పుణ్యక్షేత్రానికి అనునిత్యం వేలాది మంది భక్తులు స్వామిఅమ్మవార్ల దర్శనానికి తరలివస్తున్నారు. వారి భద్రతపై దేవస్థానం పటిష్ట చర్యలు చేపట్టింది. క్షేత్రం, భక్తుల భద్రత కోసం దేవస్థానం 578 కెమెరాలు ఏర్పాటు చేసింది. 24 గంటల పాటు సీసీ కెమెరా పర్యవేక్షణ చేపడుతున్నారు. క్షేత్ర పరిధిలోని క్యూలైన్లు, క్యూకంపార్ట్‌మెంట్లు, స్వామివారి ఆలయం, అమ్మవారి ఆలయం, ఆలయంలోని పలుచోట్ల, పాతాళగంగ వద్ద, క్షేత్ర పరిధిలోని ముఖ్యమైన ప్రధాన కూడళ్లు, వీఐపీ కాటేజీలు, గోశాల, ఉపాలయాల వద్ద, పంచమఠాలు, లడ్డూ కౌంటర్, లడ్డూ తయారీ ఇలా పలు చోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేసి ప్రస్తుతం ఉన్న 600 కెమెరాల లైసెన్స్‌కు తోడు అదనంగా మరో 400 కెమెరాలను ఏర్పాటు చేసి మొత్తం 1,000 కెమెరాలతో పర్యవేక్షణ చేపట్టేలా హిక్ సెంట్రల్ సాఫ్ట్‌వేర్ లైసెన్స్‌ను దేవస్థానం అనుమతి పొందింది. సీసీ కెమెరాలతో శ్రీశైల క్షేత్రంలో పటిష్ట నిఘా ఏర్పాటు చేశారు.



కమాండ్‌కంట్రోల్ రూంలో సీసీ కెమెరాల పర్యవేక్షణను వివరిస్తున్న ఇంజినీర్

కమాండ్ కంట్రోల్ రూం ద్వారా పర్యవేక్షణ

శ్రీశైల మహాక్షేత్రంలో భద్రత కోసం సీసీ కెమెరాలతో పాటు ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. కమాండ్ కంట్రోల్ రూంలో 50 ఇంచుల సర్వేలెన్స్ వీడియో మానిటర్స్ 21 ఉన్నాయి. వాటి ద్వారా అన్ని కెమెరాల ఫీడ్‌ను స్క్రీన్ల ద్వారా నిపుణులైన ఇంజినీర్ నిరంతరం పర్యవేక్షిస్తుంటారు. సీసీరూంలో మూడు షిఫ్ట్‌లలో ఇద్దరు చొప్పున సెక్యూరిటీ గార్డులు పర్యవేక్షిస్తుంటారు. ఏ చిన్న ఘటన జరిగినా తక్షణమే స్పందించి దేవస్థాన అధికారులకు సమాచారాన్ని చేరవేస్తారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరిస్తారు. మహాశివరాత్రి, ఉగాది బ్రహ్మోత్సవాల్లోనూ పోలీసు అధికారులు సీసీరూంలోనే కంట్రోల్‌రూంను ఏర్పాటు చేసి భద్రత పర్యవేక్షిస్తారు.



శ్రీశైల ఆలయం


భక్తుల కౌంటింగ్‌కూ కెమెరా..

క్షేత్రంలో సీసీ కెమెరాలతో పాటు స్వామివారి ఆలయం, అమ్మవారి ఆలయం వద్ద, అన్నదాన భవనంలో ప్రత్యేకంగా పీపుల్స్ కౌంటింగ్ కెమెరాలను ఏర్పాటు చేశారు. తద్వారా స్వామిఅమ్మవార్లను దర్శించుకునే భక్తుల సంఖ్యను గుర్తిస్తున్నారు. గంటకు ఎంత మంది భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారనేది ఇట్టే తెలిసిపోతుంది. అలాగే స్వామిఅమ్మవార్ల అన్నప్రసాదాన్ని ఎంత మంది భక్తులు స్వీకరించారు అనేది కూడా తెలుసుకోవచ్చు. టోల్‌గేట్ వద్ద ఏర్పాటు చేసిన కెమెరాలతో క్షేత్రంలోకి ఎన్ని వాహనాలు ప్రవేశించాయి, ఎన్ని వాహనాలు బయటికి వెళ్లాయి అని వాహనాల కౌంటింగ్ కూడా చేసేలా కెమెరాలను ఏర్పాటు చేశారు. ఉత్సవాల సమయంలో కైలాస ద్వారం వద్ద ఏర్పాటు చేసిన కెమెరాతో కాలినడక ఎంత మంది భక్తులు తరలివస్తున్నారని కూడా తెలుసుకోవచ్చు.

అసాంఘిక శక్తుల ఆటకట్టు

స్వామివారి ఆలయం, అమ్మవారి ఆలయం, శ్రీశైలం ఆర్టీసీ బస్టాండ్, పాతాళగంగలో ఫేస్ రికగ్నైజేషన్ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఆయా కెమెరాల ద్వారా అసాంఘిక శక్తులను కెమెరాలు గుర్తించి తక్షణమే పోలీసు అధికారులకు సమాచారాన్ని చేరవేస్తారు. తద్వారా పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తారు. క్షేత్ర పరిధిలో ఉన్న సీసీ కెమెరాలతో చాలా వరకు దొంగతనం, ఇతర కేసులను, ఇతర ప్రాంతాలలో క్రైంలకు పాల్పడిన వ్యక్తులను గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

భద్రత కోసం మరిన్ని సీసీ కెమెరాలు



శ్రీశైల క్షేత్రం పరిధిలో సుమారు 600 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. క్షేత్ర భద్రత కోసం భవిష్యత్తులో మరిన్ని కెమెరాలను ఏర్పాటు చేస్తాం. వీటిని కమాండ్ కంట్రోల్ రూం ద్వారా పర్యవేక్షిస్తూ ఏ చిన్న ఘటన జరిగినా తక్షణమే చర్యలు తీసుకుంటున్నాం.

– డి.పెద్దిరాజు, శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి


కర్నూలు కేసీ కెనాల్‌లో నిమజ్జన దృశ్యం


హొళగుంద వద్ద ఎల్లెల్సీలో..


పెద్దకడబూరు మండలం బాపులదొడ్డిలో రూ. 32వేల ధరతో వినాయకుడి లడ్డూ దక్కించుకున్న కుటుంబం

బైబై గణేశా!

మూడు రోజుల పాటు భక్తుల నుంచి పూజలు అందుకున్న గణనాథుడు సోమవారం గంగమ్మ ఒడికి చేరుకున్నాడు. వినాయక విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి ఆయా గ్రామాల సమీపంలోని చెరువులు, కుంటలు, వాగుల్లో నిమజ్జనం చేశారు. నిమజ్జనోత్సవంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. డప్పులు, మేళతాళాలు, బాణసంచాపేలుళ్ల మధ్య యువకులు చిందులు వేస్తూ ఉత్సాహంగా కనిపించారు. వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

–సాక్షినెట్‌వర్క్


కర్నూలులో నిమజ్జనానికి వినాయకుడిని తీసుకొస్తున్న మహిళలు






1.కోవెలకుంట్ల కుందూనదిలో విఘ్నేశ్వరుడి విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు 2.జూపాడుబంగ్లా మండలం కేసీ కాల్వలో నిమజ్జనం


భక్తజనం మధ్య హొళగుందలో గణేశ్ విగ్రహాల ఊరేగింపు


గడివేముల మండలం బిలకలగూడూరులో నిమజ్జనానికి తరలుతున్న గణనాథులు


కర్నూలులో నిమజ్జనోత్సవ ఉత్సాహం


మద్దికెర మండలం పెరవలిలో ఉట్టి కొడుతున్న యువకులు


దొర్నిపాడు మండలం క్రిష్టిపాడులో నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు


హొళగుందలో కలశాలతో చిన్నారులు

ఆకతాయికి జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ఆకతాయికి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డి గారి రాంభూపాల్‌రెడ్డి సోమవారం జైలు శిక్ష విధించినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. విశ్వనగర్‌కు చెందిన భూపని దుర్గబోయిన ప్రసాద్.. విశ్వనగర్ ఆర్చి వద్ద దారిన పోయే మహిళలకు సైగలు చేస్తూ ఈలలు, కేకలు వేస్తూ అసభ్యకర పదజాలంతో దూషించేవాడు. బాధిత మహిళలు టూటౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా జడ్జి ఏడు రోజులు జైలు శిక్షను విధిస్తూ తీర్పు వెలువరించినట్లు పోలీసులు తెలిపారు.

ముస్లింల సోదరభావం అభినందనీయం


మజ్జిగ పోస్తున్న సీఐ అశోక్ కుమార్, నాయకులు

కొత్తాళం: ముస్లింల సోదరభావం అభినందనీయం అని కొత్తాళం సీఐ అశోక్‌కుమార్, విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి, గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మారుతీమోహన్, ఎంపీడీఓ సుబ్బారాజు, డిప్యూటీ తహసీల్దారు వీరేంద్రగౌడ్ అన్నారు. మండల కేంద్రమైన కొత్తాళంలో సోమవారం జరిగిన గణేశ్ నిమజ్జన కార్యక్రమంలో మండల అవాజ్ కమిటీ ఆధ్వర్యంలో నీళ్ల ప్యాకెట్లు, మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని వీరు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ అందరూ కలసి మెలసి చేస్తేనే పండుగ అన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాల్‌దినకర్, కమిటీ పెద్ద ప్రహ్లాదచారి, వైస్ ఎంపీపీ బుజ్జీస్వామి, గణేశ్ కమిటీ సభ్యులు రాఘవేంద్రరెడ్డి, సుబ్బరాజు, చౌదరి బసవ, ఉప సర్పంచ్ సక్రి తిక్కయ్య, పెద్దలు దూద్‌బాషా, వలీ సాబ్, మహబుబ్, ఇసాక్, షేక్షావలీ, గౌస్‌పీర్, జిన్న వలి, మౌలానా అక్బర్ పాల్గొన్నారు.

పెద్దాసుపత్రిలో అరుదైన గుండెశస్త్రచికిత్స


అతావుర్ రెహమాన్‌తో డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): పలు ఆరోగ్య సమస్యలు ఉన్న వ్యక్తికి గుండె శస్త్రచికిత్స చేసి ప్రాణం పోశారు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల వైద్యులు. ఆసుపత్రి సూపరింటెండెంట్, కార్డియోథొరాసిక్ హెచ్‌వోడి డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. నందికొట్కూరుకు చెందిన అతావుర్ రెహమాన్(66) వ్యవసాయ కూలీ. అతనికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. అతనికి ఇటీవల ఛాతీలో నొప్పి రావడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. యాంజియోగ్రామ్ చేయడంతో అన్ని రక్తనాళాలు బ్లాక్ కావడంతో పాటు గుండెపనితీరు 25 శాతం మాత్రమే ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. బైపాస్‌సర్జరీ చేయాలంటే ఊపిరితిత్తుల్లో సీవోపీడీ సమస్య ఉంది. దీని కారణంగా గుండె పెద్దగా మారింది. ప్రైవేటులో అతనికి వైద్యం నిరాకరించడంతో ఇక్కడికి వచ్చారని, తాము కూడా కాదంటే వారి కుటుంబం రోడ్డున పడుతుందని గ్రహించి.. వారం క్రితం గుండె శస్త్రచికిత్స చేసినట్లు డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. వారం రోజుల తర్వాత అతను పూర్తి కోలుకున్నాడని చెప్పారు.

పశుసంవర్ధక శాఖలో పదోన్నతులు

కర్నూలు(అగ్రికల్చర్): పశుసంవర్ధక శాఖలో ఉమ్మడి కర్నూలు జిల్లాకు సంబంధించి అసిస్టెంట్ డైరెక్టర్ స్థాయి అధికారులకు డిప్యూటీ డైరెక్టర్లుగా పదోన్నతులు లభించాయి. ➤ కోవెలకుంట్ల వెటర్నరీ ఏరియా హాస్పిటల్ ఏడీగా పనిచేస్తున్న వీరబ్రహ్మంను డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పించి జమ్ములమడుగు డివిజినల్ డీడీగా నియమించారు. ➤ దెందులూరు ఏడీ కె.శ్రీనివాసరావును పదోన్నతిపై నంద్యాల డివిజన్ డీడీగా నియమించారు. ➤ నంద్యాల డీడీ రమణమూర్తిని అక్కడే డిప్యూటేషన్‌పై ఘనీకృత వీర్యకేంద్రం డీడీగా నియమించారు.

➤ ఆదోని డివిజినల్ డీడీ రమణను బనవాసి ఘనీకృత వీర్య కేంద్రం డీడీగా డిప్యూటేషన్‌పై బదిలీ అయ్యారు. ఈ స్థానంలో చిత్తూరు జిల్లాలో వీపీసీ ఏడీగా పనిచేస్తున్న రాజశేఖర్‌రెడ్డిని పదోన్నతిపై డీడీగా నియమించారు.

➤ నంద్యాల ఘనీకృత వీర్యకేంద్రం డిప్యూటీ డైరెక్టర్ ఓ.నరసింహారావుకు జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పించి గుంటూరు జిల్లాకు బదిలీ చేశారు.

ట్రాక్టర్ ఢీకొని మహిళ మృతి

గోనెగండ్ల: మండల పరిధిలోని ఐరన్‌బండ గ్రామంలో సోమవారం ట్రాక్టర్ ఢీకొని బోయ జయశ్రీ(29) అనే మహిళ మృతి చెందింది. సీఐ గంగాధర్ తెలిపిన వివరాల మేరకు.. ఐరన్‌బండ గ్రామానికి చెందిన బోయ జయశ్రీ సోమవారం ఉదయం గొల్ల పద్మావతి అనే మహిళతో కలిసి పొలంలో కూలీ పనులు చేసేందుకు వెళ్తుండగా ట్రాక్టర్ వచ్చి ఢీకొట్టింది. దీంతో జయశ్రీకి తీవ్రగాయాలయ్యాయి. గమనించిన చుట్టుపక్కల వారు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలి భర్త రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ ముల్ల బాబుబాషాపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మృతురాలికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.

ఫీల్డ్‌అసిస్టెంట్ తొలగింపునకు టీడీపీ కుట్ర

తుగ్గలి: ఉప్పర్లపల్లి ఫీల్డ్‌అసిస్టెంట్ రాజునాయక్‌ను తప్పించాలని అధికారులపై టీడీపీ నేతలు ఒత్తిడి తెస్తున్నారు. అధికారులు చర్యలకు ఉపక్రమించడంతో కూలీలు అడ్డుకున్నారు. దివ్యాంగుడైన ఫీల్డ్‌అసిస్టెంట్ రాజునాయక్ ఇప్పటి వరకు 12 సార్లు ఉత్తమ ఫీల్డ్ అసిస్టెంట్ అవార్డు అందుకుని అధికారుల మన్ననలు పొందారు. కరోనా విపత్కర సమయంలో సైతం కూలీలకు పనులు కల్పించారు. అలాంటి ఎఫ్‌ఏను తప్పించాలని టీడీపీ నేతలు తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు. ఏ తప్పు చేయని తనను తప్పించేందుకు అక్రమాలకు పాల్పడ్డానని ఉపాధి అధికారులకు ఫిర్యాదు చేశారని ఫీల్డ్ అసిస్టెంట్ తెలిపారు. విచారణ పేరుతో సోమవారం ఏపీడీ ఫక్కీరప్ప గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలాంటి అవినీతికి పాల్పడకున్నా ఎలా తొలగిస్తారంటూ కూలీలు.. ఫీల్డ్ అసిస్టెంట్‌కు మద్దతుగా నిలిచారు. ఈ విషయమై ఏపీడీని సంప్రదించగా అక్రమాలకు పాల్పడ్డాడని ఫీల్డ్‌అసిస్టెంట్‌పై ఫిర్యాదు రాలేదని, ఉప్పర్లపల్లి పంచాయతీలో ఉన్న తండాలు ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పడ్డాయని, దీంతో ఉప్పర్లపల్లికి ప్రత్యేక ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించాలని కోరినట్లు చెప్పారు.

ప్రాసెసింగ్ చార్జీలు లేకుండా పర్సనల్ లోన్లు

కర్నూలు(అగ్రికల్చర్): ప్రభుత్వ ఉద్యోగులకు ఎస్‌బీఐ ట్రెజరీ బ్రాంచ్ ద్వారా పెద్ద ఎత్తున పర్సనల్ లోన్‌లు మంజూరు చేయనున్నట్లు చీఫ్ మేనేజర్ సీవీఆర్ ప్రసాద్ తెలిపారు. పర్సనల్ లోన్ గరిష్టంగా రూ.35 లక్షల వరకు ఇస్తామని ఆయన సోమవారం విలేకరులకు తెలిపారు. ఉద్యోగులకు మరింత ఊరట కలిగించేలా ప్రాసెసింగ్ చార్జీలను పూర్తిగా మినహాయిస్తున్నట్లు తెలిపారు. కాగా సెప్టెంబర్ నెలలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉపాధ్యాయులకు అదనంగా వడ్డీ రేటులో 0.50 శాతం వరకు మినహాయింపు ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సదుపాయం ఈ నెల చివరి వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందన్నారు.

పల్లెల్లో అంతర్గత రహదారులకు ప్రతిపాదనలు

కర్నూలు(అర్బన్): జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మించేందుకు పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులు జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపుతున్నారు. నిబంధనల మేరకు ఒక్కో మండలానికి రూ.2 కోట్ల విలువైన పనులు చేపట్టేందుకు వీలుగా అంచనాలు రూపొందించారు. ఇప్పటి వరకు జిల్లాలోని కోడుమూరు, మంత్రాలయం నియోజకవర్గాలు మినహా మిగిలిన అన్ని నియోజకవర్గాలకు చెందిన మండలాల నుంచి వచ్చిన ప్రతిపాదనలను కలెక్టర్‌కు నివేదించేందుకు పీఆర్ ఇంజినీర్లు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఒక్కో మండలానికి రూ.2 కోట్ల ప్రకారం జిల్లాలోని 25 మండలాల్లోని గ్రామాల్లో రూ.50 కోట్ల వ్యయంతో పనులు ప్రారంభం కానున్నాయి.

అతిసారంతో వృద్ధురాలి మృతి


ఇమాంబి (ఫైల్)

ఆళ్లగడ్డ: అతిసార వ్యాధితో ఓ వృద్ధురాలు మృతి చెందగా మరో పది మందికి పైగా అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్నారు. పట్టణంలోని చాంద్‌వీధికి చెందిన ఇమాంబీ (70) వాంతులు విరేచనాలకు గురై సోమవారం మృత్యువాత పడింది. రెండు రోజుల క్రితం అస్వస్థతకు గురైన ఇమాంబీని కుటుంబ సభ్యులు పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించి చికిత్స చేయించినప్పటికీ కోలుకోలేకపోయింది. కాగా మూడు రోజులుగా ఇదే కాలనీకి చెందిన పలువురు అతిసార వ్యాధికి గురై వాంతులు, విరేచనాలతో ఇబ్బంది పడుతున్నారు.

గణేశ్ ఉత్సవాల్లో అపశ్రుతి

- వివిధ ప్రాంతాల్లో ఇద్దరు మృతి.. ఒకరు గల్లంతు




గల్లంతైన బాలుడు లాల్‌బాషా, మృతిచెందిన అశోక్

ఆళ్లగడ్డ/వెల్దుర్తి: గణేశ్ ఉత్సవాల్లో మూడోరోజు సోమవారం అపశ్రుతులు చోటు చేసుకున్నాయి. అహోబిలంలో నిమజ్జనం చేస్తుండగా ఓ బాలుడు గల్లంతయ్యాడు. ఆళ్లగడ్డలో వినాయక విగ్రహం మండపం వద్ద డ్యాన్స్ వేస్తూ యువకుడు మృతి చెందాడు. వెల్దుర్తి మండలం సూదేపల్లె గ్రామంలో నిమజ్జనోత్సవం సందర్భంగా నీటిలో మునిగి వృద్ధుడు మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. అహోబిలం గ్రామంలోని తెలుగంగ ప్రధాన కాలువలో విగ్రహాలను నిమజ్జనం చేస్తుండగా నలుగురు అందులో పడి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయారు. ముగ్గురు యువకులు కొంత దూరం వెళ్లి ఒడ్డుకు చేరుకోగా లాల్‌బాషా (12) గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న పంచాయతీ, పోలీస్, రెవెన్యూ అధికారులు రాత్రి పొద్దుపోయేవరకు తెలుగుగంగ కాల్వ వెంట గాలింపు చేపట్టినా బాలుడి ఆచూకీ లభ్యం కాలేదు. బాలుడి తండ్రి లాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు.

డ్యాన్స్ వేస్తూ..

ఆళ్లగడ్డ గంగమ్మ వీధిలోని గణేశ్ మండపం వద్ద డ్యాన్స్ వేస్తూ అశోక్ (25) అనే యువకుడు మృతి చెందాడు. ఆశ్రమ వీధికి చెందిన అశోక్ ఆదివారం రాత్రి మండపం సమీపంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో పాల్గొని రాత్రి పొద్దుపోయేవరకు డ్యాన్స్ చేస్తూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. అక్కడే ఉన్న కొందరు గమనించి అశోక్‌ను స్థానిక వైద్యశాలకు తరలించగా అప్పటికే గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

చెరువులో మునిగి..


మృతుడు మాల మాదన్న

వెల్దుర్తి మండలం సూదేపల్లె గ్రామంలో నీటిలో మునిగి వృద్ధుడు మృతిచెందాడు. సోమవారం నిమజ్జనం సందర్భంగా గ్రామస్తులు విగ్రహాలను సమీప చెరువుకు తరలించారు. గ్రామానికి చెందిన మాల మాదన్న(74) చెరువులోకి దిగాడు. అనంతరం అందరూ ఇంటికి చేరుకోగా మాదన్న రాకపోవడంతో కుటుంబసభ్యులు పలుచోట్ల గాలించారు. చివరికి చెరువులో మాదన్న మృతదేహం తేలి కనిపించింది. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు. మాదన్న మృతి పట్ల గ్రామపెద్దలు సంతాపం వ్యక్తం చేశారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

క్లుప్తంగా

వరద బాధితులకు మాజీ సైనికుల వితరణ

కర్నూలు(అర్బన్): విజయవాడ నగరంతో పాటు చుట్టుపక్క గ్రామాల్లోని వరద బాధితులను ఆదుకునేందుకు జిల్లాలోని మాజీ సైనికుల నుంచి విరాళాలు సేకరిస్తున్నట్లు జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు నర్రా పేరయ్య తెలిపారు. మాజీ సైనికులు ఇంటిగ్రేటెడ్ ట్రీ సర్వీస్ ఈఎస్ఎంకు రూ.500 నుంచి రూ.4 వేల వరకు ఫోన్‌పే చేయాలని కోరామని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫోన్‌పే చేసిన మొత్తాలకు సంబంధించిన స్క్రీన్ షాట్‌లను తమకు పంపుతున్నారని తెలిపారు. ప్రతి మాజీ సైనికుడు ఈ కార్యక్రమంలో పాల్గొని తమకు తోచిన రీతిలో ఆర్థిక సహాయాన్ని అందించాలని కోరారు.

అప్పలబాధతో రైతు ఆత్మహత్య


హనుమన్న(ఫైల్)

తుగ్గలి: అప్పుల బాధతో మండల పరిధిలోని జొన్నగిరి గుంత అనుమన్న (59) అనే రైతు ఆత్మహత్య చేసుకున్నారు. గుత్తి రైల్వే పోలీసులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాల మేరకు.. గుంత అనుమన్న ఉన్న నాలుగున్నర ఎకరాల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సేద్యం గిట్టుబాటు కాక, మరో వైపు కుటుంబ పోషణ, పిల్లల పెళ్లిళ్లు చేసి అప్పులపాలయ్యారు. రూ. లక్షల్లో ఉన్న అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపంతో ఆదివారం ఇంటి నుంచి వెళ్లిపోయి గుత్తి మండలం జక్కలచెర్వు సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. మృతుడికి భార్య జమునమ్మ, ఇద్దరు కుమారులు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు రైల్వే ఎస్‌ఐ నాగప్ప తెలిపారు.

వీరశైవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

కర్నూలు(హాస్పిటల్): వీరశైవ ప్రతిభా పురస్కారాలకు ఉమ్మడి కర్నూలు జిల్లాలో అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని వీరశైవ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు చంద్రశేఖరప్ప సోమవారం ఒక ప్రకటనలో కోరారు. 2024 సంవత్సరంలో ఎస్‌ఎస్‌సీ, ఇంటర్‌లో 90 శాతానికి పైగా మార్కులు పొందిన విద్యార్థులు మాత్రమే పురస్కారాలకు అర్హులన్నారు. అలాగే ఇదే సంవత్సరంలో ఎన్ఐటి, ఎన్ఈఈటి, ఐఐటి, ఐఐఐటి, ఈఏపీసెట్‌ఈటీలో సీటు సంపాదించిన విద్యార్థులు, మెడికల్ సీటు పొందిన విద్యార్థులు సైతం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వీరితో పాటు 2023 సంవత్సరంలో అక్టోబర్ నుంచి ఈ యేడాది సెప్టెంబర్ వరకు పదవీ విరమణ పొందిన వీరశైవ ప్రభుత్వ ఉద్యోగులను సన్మానిస్తామన్నారు. పురస్కారాల కార్యక్రమం నిర్వహణ తేదీ త్వరలో వెల్లడిస్తామన్నారు. వివరాలకు 98857 92122 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

భవనం పైనుంచి పడి మృతి


మృతి చెందిన రవి

నందవరం: భవనం పైనుంచి పడి భవన నిర్మాణ కార్మికుడు ఎస్. రవి(35) సోమవారం మృతి చెందాడు. స్థానికులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు మేరకు.. నందవరం మండలం హాలహర్వి గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు రవి రోజు వారి కూలి పని నిమిత్తం మంత్రాలయం వెళ్లాడు. సోమవారం భవనంలో మూడో అంతస్తులో పనిచేస్తూ పైనుంచి కింద పడ్డాడు. వెంటనే పక్కన ఉన్న కార్మికులు ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతి చెందిన రవికి భార్య రత్నమ్మ, నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్

- రూ. 9 లక్షల నగదు, రెండు వాహనాలు స్వాధీనం
- గురు రాఘవేంద్ర పంప్‌సెట్లను ధ్వంసం కేసును ఛేదించిన పోలీసులు


దొంగల అరెస్ట్ చూపుతున్న ఇన్‌చార్జ్ డీఎస్పీ శ్రీనివాసాచారి, పోలీసులు




దొంగల నుంచి స్వాధీనం చేసుకున్న రూ. 9 లక్షల నగదు, కాపర్ కడ్డీలు

ఎమ్మిగనూరురూరల్: శ్రీ గురురాఘవేంద్ర లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లో పంప్ సెట్లను ధ్వంసం చేసి అందులోని ఆయిల్, రాగి వైర్లు, రాగి ప్లేట్లను దొంగలించిన కేసును పోలీసులు ఛేదించారు. అంతర్రాష్ట్ర దొంగల ముఠాకు సంబంధించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేయగా, మరో నలుగురు పరారీలో ఉన్నారు. స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఇన్‌చార్జి డీఎస్పీ శ్రీనివాసాచారి నిందితులను, పట్టుబడిన నగదు, కాపర్ కడ్డీలను, వాహనాలను సోమవారం విలేకరులకు చూపించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ శాఖ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంత్రాలయంలో మూడు, నందవరంలో మూడు, కోసిగిలో ఒకటి , డోన్‌లో ఒకటి, వైఎస్సార్ జిల్లా కమలాపురంలో ఒక కేసు నమోదు అయినట్లు చెప్పారు. దొంగలను పట్టుకునేందుకు ఎస్పీ బిందుమాధవ్ ప్రత్యేక బృందాన్ని నియమించారన్నారు. మహారాష్ట్రకు చెందిన ఏడుగురు దొంగల ముఠా పనే అని సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించినట్లు తెలిపారు. వీరు మళ్లీ చోరీ చేసేందుకు ఆంధ్రప్రదేశ్ వైపు వస్తున్నట్లు పక్కా సమచారం రావడంతో సీఐ విక్రంసింహ, నందవరం ఎస్‌ఐ శ్రీనివాసులు, మంత్రాలయం సీఐ రామాంజులు, మాధవరం ఎస్‌ఐ విజయ్‌కుమార్‌ను అప్రమత్తం చేశామన్నారు. నిందితుల సెల్ ఫోన్ సిగ్నల్స్, లోకేషన్ ఆధారంగా నందవరం మండలం నాగలదిన్నె బ్రిడ్జిపై ఐచర్ మినీ లారీ, జైలో వాహనాన్ని నిలిపి తనిఖీ చేయగా ముగ్గురు నిందితులు పట్టుబడినట్లు తెలిపారు. మహారాష్ట్ర బీడ్ జిల్లా మజల్గావ్ పట్రూడ్ తాలూకా సిందువాడి గ్రామానికి చెందిన కరణ్ సరపదే(19), మహారాష్ట్రలో షర్బానీ టౌన్ ఖాదారాబాద్ ప్లాట్‌కు చెందిన కరీముద్దీన్(47), షర్బానీ టౌన్ ధార్ రోడ్డులోని పులహరి బిల్డింగ్ దగ్గర నివాసముండే షేక్ జహీర్(48)ను అరెస్ట్ చేశామన్నారు. వారి వద్ద నుంచి ఆయిల్, కాపర్ కడ్డీలు, దొంగలించిన సొమ్ము విక్రయించగా వచ్చిన రూ. 9 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ ముఠాలో మరో నలుగురు నిందితులు పరారీలో ఉన్నారని, వారిని త్వరలో అరెస్ట్ చేస్తామని తెలిపారు. రాయలసీమలోని మరి కొన్ని చోట్ల ఈ ముఠా దొంగతనాలు చేసినట్లు విచారణలో తేలిందన్నారు. తొమ్మిది కేసుల్లోని నిందితులను అరెస్ట్ చేసిన డీఎస్పీ శ్రీనివాసాచారి ఆధ్వర్యంలో బృందం సభ్యులు జిల్లా స్పెషల్ బ్రాంచ్ సీఐ ప్రసాద్, కర్నూలు సెంట్రల్ క్రైం స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శేషయ్య, కర్నూలు సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులను ఎస్పీ బిందుమాధవ్ అభినందించారు.